క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



క్రీడాకారులకు మొక్కలను అందిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక వైఎస్సార్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా ప్రాంగణంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం క్రీడాకారులకు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెదురుపాక సతీష్, చైతన్య, నాగేంద్ర, సువర్ణ, ఆర్‌వి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

29న ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్

కాకినాడ రూరల్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఈ నెల 29న శుక్రవారం ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించనున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. రెండు కిలో మీటర్ల మేర సర్పవరం జంక్షన్ నుంచి సర్పవరం వద్ద కొత్త ఆస్పత్రి వరకు వాక్‌థాన్‌తో పాటు బీపీ, వెయిట్ బీఎంఐ, గుండె ఆరోగ్యం, డైట్, రాపిడ్ సీపీఆర్ తదితర వాటిపై స్టాల్స్ ద్వారా అవగాహన చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభిస్తారన్నారు.

వేంకటేశునిగా సీతారామస్వామి



వేంకటేశ్వరస్వామిగా దర్శనమిచ్చిన సీతారామస్వామి

బోట్‌క్లబ్: వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామిని వేంకటేశ్వరునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి స్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామికి తులసీ దళార్చన జరిగింది. ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఆలయ ఈఓ బిక్కిన వెంకటరాయ చౌదరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

కాకినాడ సిటీ: అంగన్‌వాడీల అరెస్టులను వ్యతిరేకిస్తూ పలు యూనియన్ల ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కరపలో..

కరప: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మంగళవారం అక్రమ అరెస్టులను ఖండిస్తూ అంగన్‌వాడీలు ధర్నాచేసి, నిరసన వ్యక్తంచేశారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: ప్రభుత్వ విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కచేరిపేటలోని సుందరయ్యభవన్ నుంచి ర్యాలీగా ధర్నా చౌక్‌కు చేరుకొని నిరసన తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం తీసుకువస్తే విద్యార్థుల చదువు అగమ్యగోచరమవుతుందన్నారు. పాఠశాలల విలీనం ద్వారా విద్యార్థులు చదువులకు దూరం అవుతారని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మెటిక్ చార్జీలు విడుదల చేయాలని తదితర నినాదాలు చేశారు.

ఘనంగా వామన జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరామనామక్షేత్రం సభ్యులు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో శ్రీరామ నామ క్షేత్రం, ఆంధ్ర భద్రాద్రి ఆధ్వర్యంలో వామన జయంతి ఘనంగా జరిగింది. ఆధ్యాత్మికవేత్త చంద్రరావు మాట్లాడుతూ ధర్మానికి భంగం కలిగినప్పుడల్లా తాను అవతరించి ధర్మసంస్థాపన చేస్తానని శ్రీకృష్ణుడు ప్రబోధించినట్టే దశావతారాలలో వామనవతారం ఒకటని అన్నారు. క్షేత్ర అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

రవాణా సేవల్లో సచివాలయాలు

- ఆరు నెలల్లో 12 వేల మంది సద్వినియోగం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులోకి



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఒకప్పుడు రవాణాశాఖ సేవలు పొందలాంటే మండల కేంద్రానికో, లేదా జిల్లా కేంద్రానికో రావలసి ఉండేది. తద్వారా వ్యయ ప్రయాసలతో పాటు సమయం వృథా అయ్యేది. నేటి కాలంలో ప్రతి కుటుంబానికి రవాణా శాఖ సేవలతో ఎంతో అవసరం ఉంటుంది. ప్రభుత్వ సేవలు ఏదైనా ఇంటి ముంగిటకే అందజేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. దానిలో భాగంగా మరో అడుగు ముందుకేసింది. నిత్య జీవితంలో నేడు ప్రధాన అవసరంగా ఉన్న రవాణాశాఖ సేవలను తమ గ్రామ లేదా వార్డు పరిధిలోనే అందజేయాలని సంకల్పించింది. గత మార్చి నెల నుంచి సెప్టెంబర్ నెలాఖరు ఆరు నెలల కాలంలో దాదాపు 12 వేల మంది సచివాలయాల ద్వారా ఈ సేవలు పొందారు. ఎల్‌ఎల్‌ఆర్ దరఖాస్తు నుంచి యాజమాన్య హక్కు మార్పిడి వరకూ అనేక పనులతో పాటు వివిధ రకాల పన్నులు చెల్లించడానికి రవాణాశాఖ కార్యాలయానికి వెళ్లాలి. ఆ కార్యాలయంలో పని పూర్తి కాకపోతే మధ్యవర్తిని ఆశ్రయించడం, అడిగినంత ఇచ్చి పని పూర్తిచేసుకోవడం, లేదంటే రోజుల తరబడి ప్రదక్షిణలు చేయడం పరిపాటిగా ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో సేవలను రవాణాశాఖ అందుబాటులోకి తెచ్చింది. అయినప్పటికీ చాలా మందికి కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో మీసేవ, లేదా ఇంటర్‌నెట్ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. సాంకేతికంగా పెద్దగా పరిజ్ఞానం లేనివారు ఇబ్బందులు పడేవారు. ఈ కష్టాలన్నింటికీ ఉపశమనం కలిగిస్తూ రవాణాశాఖ గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు పొందేలా ఈ సేవలకు రూపకల్పన చేశారు.

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో డ్రైవింగ్ లైసెన్స్ ఫీజు పరీక్ష ఫీజు చెల్లింపు, ఎల్‌ఎల్‌ఆర్ స్లాట్ బుకింగ్, రెన్యూవల్, ఆధార్ సీడింగ్, బదిలీ, వంటి 54 రకాల సేవలు గ్రామ సచివాలయాల ద్వారా పొందుతున్నారు. తద్వారా సుదూర ప్రాంతాల్లో ఉన్న రవాణాశాఖ కార్యాలయాలకు వెళ్లకుండా సచివాలయాల్లో సేవలు పొందవచ్చు.

ఇప్పటికే కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలలో ఆర్‌టీఏ కార్యాలయాలు ఉండగా, మండపేట కత్తిపూడి, రావులపాలెం, రామచంద్రపురం ప్రాంతాలలో యూనిట్ల కార్యాలయాలు, పెద్దాపురం, చింతూరు ప్రాంతాల్లో ఏంవీఐ కార్యాలయాలు ఉన్నాయి .

వాహనాల సంఖ్య ఇలా..

ట్రాన్స్‌పోర్టు విభాగం	84,946
నాన్ ట్రాన్స్‌పోర్టు	7,62,247
ద్విచక్రవాహనాలు	6,18,686
మోటర్‌కార్లు	43,068
ట్రాక్టర్లు	12,922
ఆటోలు	33,449
స్కూల్ బస్సులు	2449
మ్యాక్సీ క్యాబ్	4600
ఇతర వాహనాలు	2625

కార్యాలయంలో రద్దీ తగ్గింది



రవాణాశాఖ కార్యాలయాలకు వచ్చే వారి సంఖ్య గతంలో కంటే పూర్తిగా తగ్గింది. రోజుకి వందల కొద్దీ వచ్చేవారు నేడు కనీసం 50 మంది రావడం లేదు. ప్రతి ఇంటికి రెండు నుంచి మూడు వాహనాలు కలిగి ఉన్నారు. వాటి సేవలకు సంబంధించి అన్ని రికార్డులు, లైసెన్సులు ఇలా వాహనాలకు సంబంధించి సేవలు ఇది వరకులా కార్యాలయానికి రాకుండా తమ గ్రామం లేదా వార్డులో ఉన్న సచివాలయం ద్వారా సేవలు పొందచ్చు. సమయంతో పాటు డబ్బు ఆదాఅవుతుంది.

– ఎ.మోహన్, జిల్లా రవాణాశాఖాధికారి

జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు కరప విద్యార్థులు



క్రీడాకారులతో కరప హైస్కూలు ఉపాధ్యాయులు

కరప: కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలలో కరప హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం యు.లీలామనోహర్ తెలిపారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలకు రైఫిల్ షూటింగ్ అండర్–19 విభాగంలో టి.కిరణ్‌తేజ, స్విమింగ్ అండర్–19లో సాయి వీరేంద్ర, అజయ్‌వర్మ, మహేష్, ఉమామహేష్, ఖోఖో అండర్–19లో దుర్గాదేవి, అనుపమ, ఆర్చరీ అండర్–17లో మహాలక్ష్మి, తేజశ్రీ, శ్రీమహాలక్ష్మి పూజిత, శివరామకృష్ణ, తరుణశ్రీ, ఆర్చరీ అండర్–14లో షెర్లీ, సాత్విక్, ప్రవీణ్, యశ్వంత్, దుర్గాప్రసాద్, జెస్సీ ఎంపికైనట్టు హెచ్‌ఎం తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు ఖోఖో అండర్–12 విభాగంలో 12 మంది, అథ్లెటిక్స్‌కు 10 మంది విద్యార్థులు, వాలీబాల్‌కు ఒకరు ఎంపికైనట్టు హెచ్‌ఎం తెలిపారు. ఎంపికైన విద్యార్థులందరూ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన పీడీ కె.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, కృష్ణలను, ఎంపికైన క్రీడాకారులను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, ఎంఈఓలు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం లీలామనోహర్, పీఎంసీ చైర్మన్ శ్రీపాదం రమాదేవి తదితరులు అభినందించారు.

కొత్త వరి వంగడాలతో అధిక దిగుబడి

జిల్లా వనరుల కేంద్రం ఏడీ మాధవి



నడకుదురులో కొత్త వరి వంగడాలు సాగుచేసిన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

కరప: సార్వాలో సాగుచేస్తున్న ఎంటీయూ–7029 (స్వర్ణ) రకానికి ప్రత్యామ్నాయంగా కొత్త వరి వంగడాలు రూపొందించామని, రైతులు ఈ రకాలను కూడా సాగుచేసి అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు మాధవి సూచించారు. నడకుదురులో కొత్త వరివంగడాలు ఎంటీయూ–1310, ఎంటీయూ–1321 సాగు చేస్తున్న పొలాలను మంగళవారం ఆమె ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. సాగు వివరాలను ఆమె రైతులను అడిగి తెలుసుకున్నారు. కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే స్వర్ణ రకానికి చేనుపై పడిపోయే గుణం ఉంటుందని, కొత్త వరివంగడాలు పడిపోవని, దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ రకం సాగుచేసిన పొలంలో ఆకునల్లి, ఎండాకు తెగులు ఉన్నట్టు గుర్తించామని నివారణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏఎస్ఆర్ శర్మ, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీ నాయక్ తెలిపారు. ఆకునల్లి నివారణకు ఒక ఎకరాకు 400 మిల్లీ లీటర్ల ప్రొఫెనోఫాస్ లేదా 600 గ్రాములు నీటిలో కరిగే గంధకం(సల్ఫర్) పిచికారీ చేయాలన్నారు. ఎండాకు తెగులు నివారణకు ఎకరానికి 200 గ్రాముల ప్లాంటామైసిన్, 400 గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏడీఏ బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, హబ్ అధికారి ఎంవీవీ సత్యనారాయణ, వీఏఏ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భోగి గణపతి పీఠంలో అన్నదానం

బోట్‌క్లబ్: కాకినాడ సూర్యారావుపేటలో దూసర్లపూడి వారి వీధిలోని స్వయంభూ భోగిగణపతి పీఠంలో మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. 8 రోజులు పాటు అష్టగణపతి ఆరాధన, 9వ రోజు అన్నసమారాధన జరిగిందని పీఠం వ్యవస్థాపకులు రమణరాజు తెలిపారు. సుమారు 1500 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు ఎలుకల సామూహిక నిర్మూలన

కరప: మండల పరిధిలో బుధవారం ఎలుకల సామూహిక నిర్మూలన చేపట్టినట్టు ఎంఏఓ ఏవీ రాజేష్ మంగళవారం తెలిపారు. మండలానికి 65 కిలోల బ్రోమోడయోలిన్ మందు వచ్చిందన్నారు. స్థానిక ఆర్బీకేలో మంగళవారం ఉదయం 10 గంటలకు నూకలు, నూనెలో కలిపిన ఎలుకల మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తామని, రైతులందరూ ఆర్‌బీకేకు రావాలన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పర్యావరణ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తే ఎటువంటి మహమ్మారినైనా ఎదుర్కోవచ్చని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సువర్ణరాజు పేర్కొన్నారు. మానవజాతి సంక్షేమం కోసం పర్యావరణ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలనే సందేశాన్ని ప్రచారం చేయడం కోసం 2011 నుంచి సెప్టెంబర్ 26న ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంపత్ గణపతికి చెరకురసంతో అభిషేకం



బెల్లం కుందుల అలంకరణలో సంపత్ గణపతి

బోట్‌క్లబ్: చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయం ఆవరణలో ఉన్న సంపత్ గణపతి ఆలయంలో స్వామి వారికి మంగళవారం చెరకురసంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేసి, బెల్లం కుందులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెంటెంట్ కనపర్తి నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కరప: పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష అమలులో భాగంగా 30వ తేదీ నుంచి అక్టోబరు 25వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ కె.అప్పారావు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కరప పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ పి.ఆశ ఒక బృందంగా, ఎంపీడీఓ కె.అప్పారావు, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ.సింధూర మరో బృందంగా ఈ శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 30న కరప, అక్టోబరు 3న వేళంగి, 4న అరట్లకట్ట, 5న వాకాడ, 6న కొరిపల్లి, 7న వేములవాడ, 9న పెనుగుదురు, 10న కూరాడ, 11న పెనుగుదురు, 11న పాతర్లగడ్డ, 12న యండమూరు, 13న నడకుదురు, 16న సిరిపురం, 17న నడకుదురు, 18న కొంగోడు, 19న గురజనాపల్లి, 20న పెద్దాపురప్పాడు, 21న ఉప్పలంక, 24న మురుకోపోర (గొర్రిపూడి), 25న గొర్రిపూడిలో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ తెలిపారు.

బీసీ జనగణన తీర్మానం హర్షణీయం



గుబ్బల తులసీకుమార్

కాకినాడ సిటీ: బీసీ జనగణన చేపట్టేందుకు రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం గొప్ప పరిణామమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు, యు.కొత్తపల్లి జెడ్పీటీసీ కార్యదర్శి తులసీకుమార్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి బీసీ జనగణన చేపట్టాలని జనాభా దామాషా ప్రకారం రాజ్యాధికారంలో విద్యలో, ఉద్యోగాలలో, వనరులలో, నిధులలో తదితర అంశాలల్లో ఆ వార్గానికి రావలసిన వాటా కోసం సుదీర్ఘకాలంగా ఎన్నో పార్టీలు ఎన్నో సంఘాలు పోరాడుతూ వస్తున్నాయన్నారు. సమాజంలో 50 శాతం పైబడి ఉన్న వర్గాలకు కనీసం వారి జనాభా నిష్పత్తిని తెలియజేయడానికి వారి జనాభా జనగణనను తెలియజేయడానికి ప్రభుత్వాలకి చేతులు, మాటలు రాలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమని, వారిని మా బీసీ వర్గాలు తరపున మనస్ఫూర్తిగా అభినందిస్తూ ఈ బిల్లును ప్రవేశపెట్టిన రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు తులసీకుమార్ ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో జగన్‌మోహన్ రెడ్డి చేసిన జనగణన బిల్లు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.

మరో జీవితానికి వెలుగు

- అవయవ దానంపై అవగాహన
- వైద్య, నర్సింగ్ విద్యార్థుల ప్రతిజ్ఞ



అవయవ దాన ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

కాకినాడ క్రైం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ మార్గనిర్దేశంలో అవయవ దానంపై అవగాహన సదస్సు జరిగింది. మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లో ఎస్‌పీఎం లెక్చర్ గ్యాలరీలో ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సుకు హాజరైన వైద్య, నర్సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 3 వేల మంది అవయవ దానం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఒక వ్యక్తి అవయవ దానం చేస్తే 8 మందికి పునర్జన్మ లభిస్తుందని తెలిపారు. ఇది మరణం తర్వాత జీవించే ఓ సదవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్‌లోకి లాగిన్ కావడం లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అవయవ దానానికి తమ పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. జీవితం అనంతరం తమ వారిని ప్రభుత్వ బృందాలు సంప్రదిస్తాయని, కుటుంబ సభ్యుల అంగీకారంతోనే అవయవ సేకరణ జరుగుతుందని తెలిపారు. తొలిగా అవయవ దానానికి స్వచ్ఛందంగా తన పేరును నమోదు చేసుకొని సర్టిఫికెట్ పొందిన డాక్టర్ విష్ణువర్ధన్ వైద్య, నర్సింగ్ విద్యార్థులు అవయవదానానికి ముందుకొచ్చి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఆయన పిలుపుతో 100 మందికి పైగా విద్యార్థులు స్వచ్ఛంద అవయవ దానానికి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ నెల 30వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు. అనంతరం అవయవ దాన ప్రతిజ్ఞ చేశారు.

హిందూ ధర్మం విశిష్టమైనది

ఆధ్యాత్మిక గురువు సామవేదం షణ్ముఖశర్మ



ఆధ్యాత్మిక గురువు షణ్ముఖశర్మను సత్కరిస్తున్న దేవదాయశాఖ అధికారులు

బోట్‌క్లబ్: హిందూ ధర్మం చాలా గొప్పదని, దీనిలో సత్యవాదం ఉందని ఆధ్యాత్మిక గురువు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. దేవాలయంవీధిలోని పైడా చలమయ్య శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి శివశక్తి అంశంపై ప్రవచనం జరిగింది. భారతదేశం గర్వించదగ్గ అంతరిక్ష విజయం చంద్రయాన్–3లో రోవర్ దిగిన ప్రాంతానికి శివశక్తి పేరు పెట్టడం ఎంతో ఔచిత్యంతో ఉందన్నారు. శివశక్తి పేరు పెట్టడం మన భారతదేశానికే చెల్లుతుందన్నారు. శివశక్తి తత్వమే విశ్వానికంతటికీ మూలమనే సనాతనమైన విజ్ఞానమన్నారు. భారతదేశం సాధించిన ప్రతీ విజయం వెనుక సనాతన ధర్మం, విజ్ఞానం, దాని క్రాంతి ప్రవహిస్తుందన్నారు. శివశక్తి పేరు పెట్టడం మతపరమైన అంశమని కొందరు వాదించినా, దాని వెనుక విజ్ఞానం తెలుసుకొంటే గొప్ప అర్థం దాగి ఉందన్నారు. శివ శబ్దం వేదాల్లో వాడబడిందన్నారు. రుగ్వేదంలో నాసదీయ సూక్తంలో ఉందని, అనేక మంది సైంటిస్టులను ఆశ్చర్యపరిచే విజ్ఞాన రహస్యాలు వైదిక సూక్తాల్లో లభిస్తున్నాయని వారే చెబుతున్నారన్నారు. పైడా ట్రస్ట్ ద్వారా తమ పూర్వీకులను అనుసరిస్తూ ఆధ్యాత్మిక సంస్కృతి వ్యాపింపజేయడం గొప్ప విషయమన్నారు. తొలుత దాత పైడా చలమయ్య విగ్రహానికి షణ్ముఖశర్మ పూలమాలలు వేశారు. ట్రస్టు చైర్మన్ పైడా వేంకటేశ్వరరావు ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా షణ్ముఖశర్మను దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ సురేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, దేవదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ కనపర్తి నాగేశ్వరరావు, సత్రం ఈఓ పెన్మత్స విశ్వనాథరాజు, ట్రస్టు చైర్మన్ పైడా వేంకటేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో కొడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, పైడా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భవిత విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విభిన్న ప్రతిభావంతులతో ఎంఈఓలు

పెద్దాపురం: స్థానిక భవిత విద్యార్థులు క్రీడల్లో విజేతలుగా నిలచిన తీరు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారులు శర్మ, చౌదరి అన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలుగా నిలిచిన భవిత విద్యార్థులకు మంగళవారం పతకాలు, బహుమతులను వారు అందజేశారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతే విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం ఈ సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా విభాగాల్లో గెలుపొందిన విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆనందరావు, ఫిజియో థెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐని సందర్శించిన విద్యార్థులు



ఎఫ్‌సీఐ కార్యకలాపాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

సామర్లకోట: స్థానిక ఎఫ్‌సీఐ గోదాములను మంగళవారం మేరీ ఇమ్మాక్యులేట్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ ఎస్.సందీప్, ఇతర అధికారులు వై.శ్రీనివాసరావు, కె.ఏడుకొండలు బియ్యం సేకరణలో ఎఫ్‌సీఐ ప్రాముఖ్యాన్ని వివరించారు. అలాగే నాణ్యమైన బియ్యం తయారీ, ఫోర్టిఫైడ్ బియ్యం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ బియ్యం నీటిలో తేలడం వల్ల ప్లాస్టిక్ బియ్యం అనే అపోహలు ఉన్నాయని తెలిపారు. ఈ బియ్యంలో అనేక పోషక విలువలు ఉండటంతో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తోందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డైసీ, హెచ్‌ఎం జాయిసీ ఉపాధ్యాయులు రవికుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.